నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం
18 మార్చి 2026




# అయ్యప్ప సన్నిధాన నిర్మాణంకు లక్ష రూపాయల విరాళం

**చేవెళ్ల మార్చ్ 17 (నినాదం):-**

చేవెళ్ల మున్సిపల్ పరిధిలో ఊరెళ్ళ వార్డులో అయ్యప్ప సన్నిధానం అభివృద్ధిలో భాగంగా లక్ష రూపాయల చెక్కును బిఆర్ఎస్ నాయకుడు కందికొండ విగ్నేష్ గౌడ్ సన్నిధాన గురు స్వామి యాదయ్య కు మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, 15 వ వార్డ్ కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి, ఊరెళ్ళ వార్డు కౌన్సిలర్లు దూత మల్లేష్, డప్పు సువర్ణ చందు ఆధ్వర్యంలో అందజేశారు. అయ్యప్ప స్వాముల కోసం సన్నిధాన అభివృద్ధికి విరాళం అందజేసిన విగ్నేష్ గౌడ్ ను మున్సిపల్ చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభు సేట్, మాజీ సర్పంచ్ ఊరడి నర్సింలు,మాజీ సర్పంచ్ జంగీర్, మాజీ ఉపసర్పంచ్ విట్టలయ్య, రాంప్రసాద్, శ్రీపాల్, ప్రవీణ్, రాజు, శివ కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# రైతు వేదికలో న్యాచురల్ ఫార్మింగ్‌పై శిక్షణ కార్యక్రమం

**చింతపల్లి, మార్చి 17(నినాదం)**

రైతుల ఆదాయం పెంపుతో పాటు భూమి సారాన్ని కాపాడేందుకు న్యాచురల్ ఫార్మింగ్ ఎంతో ఉపయోగకరమని వ్యవసాయ శాస్త్రవేత్త రాములమ్మ తెలిపారు.మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు న్యాచురల్ ఫార్మింగ్ పై ఏటిఎంఏ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కె వి కె.కంపాసాగర్ కు చెందిన శాస్త్రవేత్త రాములమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి రైతులకు న్యాచురల్ ఫార్మింగ్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ విధానంలో రసాయన ఎరువులకు బదులుగా ఉపయోగించే జీవన ఎరువులు, వివిధ కషాయాలు తయారు చేసే పద్ధతులను వివరంగా తెలియజేశారు.న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు పంటల నాణ్యత పెరుగుతుందని, అదే సమయంలో రైతులు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తికి దోహదపడగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏటీఎం దేవరకొండ అపర్ణ , మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ కుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, ఏ ఈ ఓ లు నరసింహ, మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదాలకు ముగింపు కొరకు భూ రీసర్వే

**నూతనకల్,మార్చి 17 (నినాదం):**



రైతుల భూములు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రీసర్వే చేసి పట్టాదారు పుస్తకాలు ఇవ్వడం ద్వారా సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని తాసిల్దార్ శ్రీనివాసరావు అన్నారు.భూముల రీ సర్వే నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు యడవల్లి,పెదనెమిల గ్రామాలలో బుధవారం నాడు రైతులకు అవగాహన కల్పిస్తామని ఈ రీసర్వే ద్వారా భూముల సరిహద్దు,భూ వివాదాలు,రికార్డులు వంటి తదితర ప్రయోజనాలు కల్పించేందుకు ఈ సదస్సును రైతులు హాజరై వినియోగించుకోవాలని సూచించారు.




# వీర హనుమాన్ విజయ యాత్రకు ఆహ్వానం

## మెట్‌పల్లిలో కరపత్రం ఆవిష్కరణ

**మెట్‌పల్లి, మార్చి 17 ( నినాదం)**

పట్టణంలోని ఖాదీ శ్రీ హనుమాన్ దేవాలయంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థల నాయకులు, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మార్చి 30వ తేదీ సాయంత్రం 4 గంటలకు వట్టి వాగు మహాలక్ష్మి ఆలయం నుంచి ప్రారంభమై పాత బస్టాండ్ మీదుగా అయ్యప్ప దేవాలయం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ యాత్రలో వేలాది హనుమాన్ మాలధారులు, హిందూ బంధువులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

**కోదాడ,మార్చి 17(నినాదం):**

అనంతగిరి మండలం బొజ్జగూడెం తండాలో జిల్లా పశుగణనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుగులోతు నీలబాయి శ్రీనివాస్ ప్రారంభించి, రైతులు పశువులకు సీజన్ వారీగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మందులు, టీకాలను వినియోగించుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్యా నాగమణి రవి, గ్రామ పెద్దలు, సిబ్బంది, గోపాల మిత్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆ మహిళను కేసులో రాజీపర్చు

## కేసు వెనక్కి తీసుకోకుంటే ఉద్యోగం ఉండదు

- సంబంధం లేని కేసుతో ఒత్తిడి
- లైంగిక కేసులో ఇరికిస్తా అంటూ బెదిరింపు
- ఆఫీస్‌లోనే పరుష పదజాలంతో దూషణ..
- అందరిముందే అవమానిస్తున్నారు.
- రామ నర్సయ్య కోసం వేధిస్తున్నారు
- ఎస్సీ బాయిస్ హాస్టల్లో వార్డెన్ ఆవేదన
- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిపై నరేష్ తీవ్ర ఆరోపణలు
- అవన్నీ అవాస్తవం : అమరనేని రామారావు




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి , మార్చి 17 (నినాదం):**

జిల్లాలో ఉద్యోగ సంఘాల నాయకులే ప్రభుత్వ ఉద్యోగులను వేధిస్తున్నారనే ఆరోపణలు పెరుగుతున్నాయి. ఒక దళిత ఉద్యోగిపై జరిగిన ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**బాధితుని వివరాల ప్రకారం...**

ఇల్లెందు ఎస్సీ బాలుర వసతి గృహంలో వార్డెన్‌గా పనిచేస్తున్న కేసుపాక నరేష్ కుమార్ మెడికల్ లీవ్ అనంతరం విధుల్లో చేరేందుకు కార్యాలయానికి వెళ్లగా, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు తనతో అసభ్యంగా ప్రవర్తించి పరుష పదజాలంతో దూషించినట్లు ఆరోపించారు. తనకు సంబంధం లేని కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తూ, ఆ కేసులో ఉన్న మహిళను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి రాజీకి ఒప్పించి కేసు వెనక్కి తీసుకుంటేనే ఉద్యోగంలో కొనసాగనిస్తానని హెచ్చరించారని తెలిపారు. లేనిపక్షంలో ఉద్యోగం చేయనివ్వనని, లైంగిక వేధింపుల కేసులో ఇరికిస్తానని బెదిరించారని పేర్కొన్నారు. కార్యాలయంలోనే అందరి ముందు అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులానికి చెందిన సంఘ నాయకుడు తన ప్రభావాన్ని దుర్వినియోగం చేస్తూ దళిత ఉద్యోగిని అవమానించాడని, కుల వివక్ష చూపించాడని నరేష్ ఆరోపించారు. టీఎన్జీవో కొందరి ప్రయోజనాలకే పరిమితమై పనిచేస్తోందని విమర్శించారు. ఇతర అధికారుల సమస్యలపై సంఘం స్పందించడం లేదన్నారు. ఈ ఘటనపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని, తనకు న్యాయం చేయాలని నరేష్ కోరారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరోపణలు అవాస్తవం: అమరనేని రామారావు**

ఆరోపణలను ఖండించిన అమరనేని రామారావు, నరేష్‌పై ఎలాంటి దూషణ చేయలేదని తెలిపారు. ఆరోపణల్లో నిజం లేదని, ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేస్తున్నానని చెప్పారు. ఇల్లెందు ఘటనపై జిల్లా ఎస్సీ విభాగం ఉన్నతాధికారుల సమక్షంలోనే చర్చ జరిగిందన్నారు.

# ఉగాది వేడుకలను విజయవంతం చేయాలి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 19న జరిగే వేడుకలను విజయవంతం చేయాలని ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు కొలుగూరి సంజీవరావు,ఎర్రం సతీష్ కుమార్, కాశెట్టి శ్రీనివాస్ లు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీ వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా ప్రతి ఏటా ఉగాది పురస్కారాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ ఇల్లందు క్లబ్ లో జరిగే వేడుకలలో వేద పండితులచే పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కళాకారులకు, కవులకు, రచయితలకు నృత్య కళాకారులకు శాలువా, మెమొంటో, ప్రశంస పత్రాలతో సత్కరించడం జరుగుతుందన్నారు. భూపాలపల్లి మున్సిపల్ పాలకవర్గానికి సన్మానోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని కవులు కళాకారులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు గుజ్జ సారేశ్వర్ రావు, ములకల లక్ష్మారెడ్డి,మంద జోవర్ధన్,ఆకుతోట ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి, మార్చి 17.(నినాదం)**



కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణలో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు..మజార్, శ్రావణ్ రెడ్డి, రమేష్, ఎస్ఎన్ రెడ్డి, రాజేశ్వర్, ఎస్. రమేష్, నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల బ్యూరో మార్చి 17 (నినాదం)**



ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి బూత్ లెవల్ ఏజెంట్స్‌ను నియమించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పురోగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు.ఈ ప్రక్రియ ఓటర్ల పేర్లు తొలగించేందుకు కాదని, ఒకే వ్యక్తికి సంబంధించిన డూప్లికేట్ ఓటర్ నమోదులను తొలగించడం, వలసల వల్ల వచ్చిన లోపాలను సరిచేయడం ద్వారా స్పష్టమైన, పారదర్శకమైన కొత్త ఓటరు జాబితాను తయారు చేయడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. 2002 మరియు 2025 ఓటరు జాబితాలను పోల్చి ఓటర్లను ఏ , బి ,సి ,డి వర్గాలుగా విభజించి క్షేత్ర స్థాయిలో ధృవీకరణ జరుగుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్స్ లను నియమించాలని సూచించారు. నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లకు అధికారిక ఐడీ కార్డులు అందజేయబడతాయని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు తప్పనిసరిగా ఆ గ్రామానికి చెందిన వారే ఉండాలని,తద్వారా క్షేత్ర స్థాయిలో ఓటర్ల వివరాల ధృవీకరణ,అవసరమైన పత్రాల సేకరణలో కీలకంగా పనిచేస్తారని తెలిపారు.బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను 1--2 రోజుల్లోగా సమర్పించాలని, వారికి మార్చి 25లోపు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

అలాగే పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా గద్వాల్ పట్టణంలో పురోగతి సుమారు 48 శాతం మాత్రమే ఉన్నందున పనులను వేగవంతం చేయాలని సూచించారు.బూత్ లెవెల్ ఏజెంట్ల ద్వారా ఇంటింటి సర్వేలు నిర్వహించి, ఫారాల పంపిణీ మరియు సేకరణను చేపట్టనున్నట్లు తెలిపారు. వలసల కారణంగా ఓటర్ల వివరాల్లో ఉన్న సమస్యలతో పాటు కొత్తగా నమోదు అయిన ఓటర్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు, అధికారులు, సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏ.ఓ భూపాల్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరిటెండెంట్ మంజుల,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధిలు తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

## ఒకరి మృతి, ఇద్దరికీ గాయాలు

**దుబ్బాక మార్చి 17( నినాదం)**

దుబ్బాక పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన అనమేని లక్ష్మి (58) బలవంతపూర్‌లో జరిగిన బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం, గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన బత్తిని దేవవ్వ, శ్రీహరి దంపతులతో కలిసి పల్సర్ ద్విచక్ర వాహనంపై ముస్తాబాద్ వైపు బయలుదేరారు.దుబ్బాక శివారులోని ఒక ప్రైవేట్ పాఠశాల సమీపంలో వెనుక నుంచి అతివేగంతో వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టి అక్కడి నుంచి పరారైంది.ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ సాయంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందగా, దేవవ్వ, శ్రీహరికి చికిత్స కొనసాగుతోంది.ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని లక్ష్మి బంధువు నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని తహసిల్దార్‌కి వినతి పత్రం

**నిర్మల్ ప్రతినిధి(సోన్) మార్చి 17.(నినాదం):**



సోన్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది...ఈ కార్యక్రమం లో అధ్యక్షులు మార గంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల పాలనలో ఇప్పటి వరకు ఆరు గ్యారంటీలను, 420 హామీలకు ఈ బడ్జెట్ లోనైనా నిధులు కేటాయించాలని అదేవిధంగా రైతులకు ఇస్తా అన్నటువంటి రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయశీ కోసం కూడా వెంటనే నిధులు ఇచ్చి రైతులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమం ముఖ్య అతిథి జిల్లా కార్యదర్శి,న్యూ వెల్మల్ సర్పంచ్ రాచకొండ సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ భృతి కల్పించడంలో విఫలమైందని, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల, రైతులకు రైతు భరోసా, నూతన పెన్షన్ల అమలులో ఇలా అనేక హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి హామీను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సరికెల గంగన్న, బర్ల హరీష్ రెడ్డి, ముత్కపల్లి నరేష్,అల్లూరి నర్సారెడ్డి, సర్పంచులు సిహెచ్ గంగాధర్, మారి విలాస్, దేశెట్టి నరేష్,బర్ల రాజు మండల ప్రధాన కార్యదర్శిలు సుంచు సవీన్, మామిడాల సంతోష్ నాయకులు, చిట్టిమల్ల ఉదయ్, మేకల మల్లేష్, నాగయ్య, శ్రీనివాస్, పోశెట్టి, దేవన్న, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక దందా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం మైనింగ్ శాఖ పిఓ

**చెన్నూర్ మార్చి17(నినాదం)**



చెన్నూర్ మండలంలోని చింతలపల్లి గ్రామ సమీపంలో నడుస్తున్న ఇసుక క్వారీల్లో ఎటువంటి అక్రమ ఇసుక దందా నడవడం లేదు అక్రమ ఇసుక దందా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ పిఓ వెంకటేశ్వర్లు ఏ.డి జగన్మోహన్ రెడ్డి అన్నారు ఏదైనా అక్రమ రవాణా జరుగుతే మా దృష్టికి తేవాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ ఏడి తెలిపారు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా జరుగులే సహించేది లేదని , ఆయన తెలిపారు. క్వారీ యజమానులు తమకున్న ఆదేశాల అనుసారం మాత్రమే ఇసుక క్వారీ నడపాలని లేని పక్షములో ఏదైనా అక్రమాలకు పాల్పడితే ఇసుక క్వారీ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు....



# కనిపించకుండా పోయిన మాదాల వెంకన్న మృతదేహం లభ్యం

**గుండాల, మార్చి 17 (నినాదం):**



నాలుగు రోజులుగా కనపడకుండా పోయిన మాదాల వెంకన్న మృతదేహం మంగళవారం నర్సాపురం కన్నాయిగూడెం సమీపంలోని మొక్కజొన్న చేనులో విగతజీవిగా కనిపించడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్లిన మాదాల వెంకన్న సాయంత్రం అయినా ఇంటికి రాకపోయేసరికి ఆరోజు రాత్రి ఆదివారం రోజు తమ దూరపు బంధువులకు ఫోన్ చేసి తెలుసుకోగా వారుకూడా తమ వద్దకు రాలేదని తెలపగా సోమవారం మండలంలోని పోలీస్ స్టేషన్ కు వెళ్లి మిస్సింగ్ కేస్ నమోదు చేసి సీసీటీవీ ఫుటేజ్ చెక్ చేసి మొబైల్ సిగ్నల్ చెక్ చేయగా గుండాల టవర్ సిగ్నల్ అందుబాటులో మొబైల్ స్విచ్ ఆఫ్ అయినట్టుగా తెలిపారు. మంగళవారం ఉదయం కన్నాయిగూడెం నరసాపురం గ్రామస్థులకు విషయం వివరించి గాలింపు చేపట్టారు సమీపంలోని మల్లన్న వాగు నర్సాపురం మధ్యలో ఉన్న మొక్కజొన్న చేనులో అనుమానాస్పదంగా వికతజీవిగా పడిఉన్న మాదాల వెంకన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు స్థానిక పోలీస్ స్టేషన్ కు తెలియజేశారు.గుండాల సీఐ తిరుపతి మృతదేహాన్ని పంచనామా చేపించి కేసు ధర్యాప్తు చేస్తున్నామన్నారు.

# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం
18 మార్చి 2026


# వ్యాపారులకు వద్దు.. మరి రైతులకు..

**నిరుపయోగంగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన మార్కెట్**

**ఒకప్పుడు కళకళలాడిన ప్రాంతం ఇప్పుడు కళ తప్పింది**

**రైతుల కోసం ప్రత్యేకంగా మార్కెట్ పునః ప్రారంభించాలని డిమాండ్లు**




**హుజూరాబాద్, మార్చి 17 (నినాదం)**

హుజూరాబాద్ పట్టణంలోని పాత మార్కెట్ నిర్వహించే స్థలంలో, అప్పటి గవర్నమెంట్ నూతన భవనం నిర్మించి అన్ని సౌకర్యాలతో ప్రారంభించారు .కొన్ని రోజులు సాఫీగానే సాగిన మార్కెట్, తరువాత వినియోగదారులు రావడంలేదని ,మార్కెట్లో కూర్చొని అమ్ముకోవడానికి సరిగా లేదని.అక్కడికి వెళ్లి వ్యాపారం చేయడానికి ఆసక్తి చూపలేదు.తరువాత మార్కెట్ ను మసీద్ ప్రాంతానికి తరలించారు. అప్పటినుండి మార్కెట్ నిరుపయోగంగా ఉంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన మార్కెట్ భవనం ఇప్పుడు ఖాళీగా కనిపిస్తుంది.అయితే దీన్ని ప్రత్యేకంగా రైతుల కోసమే మళ్లీ మార్కెట్ ను పునః ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.రైతులు తమ పంటలను నేరుగా విక్రయించుకునేలా ప్రభుత్వం అనేక ప్రాంతాల్లో ప్రత్యేక మార్కెట్లను ఏర్పాటు చేసింది.



రైతు మార్కెట్ నిర్మాణం వెనుక ముఖ్య ఉద్దేశం రైతులు మధ్యవర్తులు లేకుండా తమ పంటలను నేరుగా వినియోగదారులకు లేదా వ్యాపారులకు విక్రయించుకోవడం.దీంతో కష్టపడి పంట పండించిన రైతుకు మంచి ధర లభిస్తుంది. వినియోదారులకు అందుబాటులో ధరలు ఉంటాయి.

**రైతు మార్కెట్ ప్రత్యేకతలు:**

ఈ మార్కెట్లో రైతులకే అమ్ముకునే అవకాశం . వ్యవసాయ శాఖ అధికారులు స్వయంగా రైతులు వేసిన పంటలను గుర్తించిన తర్వాతనే మార్కెట్లోకి అనుమతిస్తారు. రైతులకు ప్రత్యేకంగా ఐడి కార్డు ఇచ్చి, అన్ని సౌకర్యాలు మార్కెట్లో కల్పిస్తారు. మార్కెట్లో వ్యవసాయ శాఖ అధికారి ఉండి నిత్యం పర్యవేక్షిస్తాడు. అలాగే వినియోదారులకు ఇబ్బంది కలగకుండా రోజు ధరలను నిర్ణయించి ధరల పట్టిక ఏర్పాటు చేస్తారు.అటు రైతుకు లాభం, ఇటు వినియోదారుడికి లాభం.ఆ రకంగా ప్రస్తుతం హుజూరాబాద్ లో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ ను రైతుల కోసం అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.ఒకప్పుడు వ్యాపారాలతో , గురువారం అంగడితో కళకళలాడిన ఈ ప్రాంతం, మార్కెట్ తరలిపోవడంతో కళతప్పింది.ఈ మార్కెట్‌ను మళ్లీ రైతుల ప్రయోజనాల కోసం సక్రమంగా ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## అయిజ పీహెచ్సీలో ఒకే రోజు 6 సాధారణ కాన్పులు

**గద్వాల ప్రతినిధి మార్చి 18 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ జి. చంద్రకళ నేతృత్వంలో ఒకే రోజు ఆరు సాధారణ కాన్పులను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిఎంహెచ్ఓ మరియు మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ఆదేశానుసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి గర్భిణీ స్త్రీలకు 99 శాతం నార్మల్ డెలివరీలు చేయాలి మిగిలిన 1% జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. ఉన్నతాధికారుల సలహాల సూచనలను మేరకే సాధారణ కాన్పులు చేయడం సాధ్యమైందని అన్నారు.ఈ విషయమై ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ మరియు సిబ్బంది ఆమెను అభినందించారు. ఈ విషయం డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగన్న వైద్య సేవలకు ఇది నిదర్శనమని అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున నార్మల్ డెలివరీలు మా సిబ్బంది చేస్తున్నారు జిల్లాలోనే ఎన్నోసార్లు ముందుండి అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు.



## కేజీబీవీ పాఠశాలలకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల ప్రతినిధి మార్చి 17 (నినాదం )**

కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల్లో ఎలాంటి రాజీ లేకుండా కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు మంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని కెజిబివి పాఠశాలలలో మౌలిక సదుపాయాలు,ఖర్చులు తదితర అంశాలపై కెజిబివి పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేజీబీవీ పాఠశాలల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమతి లేకుండా ఎవ్వరినీ పాఠశాల ప్రాంగణంలోకి అనుమతించరాదని తెలిపారు. విద్యార్థినుల సంక్షేమం, భద్రత,సౌకర్యాల పరిరక్షణలో ప్రిన్సిపాళ్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.మరుగుదొడ్ల పరిశుభ్రత,సురక్షిత తాగునీరు, నాణ్యమైన ఆహారం,విద్యార్థినుల నిద్రకు తగిన వసతులు వంటి కనీస మౌలిక సదుపాయాలపై ఎలాంటి రాజీ పడరాదని తెలిపారు. పాఠశాలలకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ,కేజీబీవీ ఫైనాన్స్ అధికారి మధుసుధన్, కోఆర్డినేటర్ హంపయ్య, సంబంధిత అధికారులు,కేజీబీవీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి బార్ ఎన్నికలకు రంగం సిద్ధం

**మహిళలకు రిజర్వేషన్... ఎన్నికల అధికారుల నియామకం పూర్తి**

**మెట్‌పల్లి, మార్చి 17 (నినాదం)**




మెట్‌పల్లి బార్ అసోసియేషన్ 2026–27 సంవత్సరానికి గాను ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు మంగళవారం అత్యవసర ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం సీనియర్ న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, ఏలేటి శ్రీనివాస్ రెడ్డి, పుప్పాల భానుమూర్తిని ఎన్నికల అధికారులుగా నియమించినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించినట్లు వెల్లడించారు.ఎన్నికలు బార్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించామని, ఇందుకు సంబంధించిన నియామక పత్రాలు, ఓటరు జాబితాను ఎన్నికల అధికారులకు అందజేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి గజేల్లి రాందాస్, కోశాధికారి పడిగేల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి పులి నర్సయ్య, మహిళా ప్రతినిధి ఆకుల మానసతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## తోగ్గూడెం అక్రమ మైనింగ్ వ్యవహారంపై విచారణ జరపాలి

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు**

**కొత్తగూడెం, మార్చి17(నినాదం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని తోగ్గూడెం గ్రామంలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల్వంచ మండలంలోని తోగ్గూడెం గ్రామంలో అనేక సంవత్సరాలుగా సుమారు 10 క్వారీలు మరియు 7 నుండి 8 క్రషింగ్ మిల్లులు నడుస్తున్నాయని తెలిపారు.

ఈ క్వారీలు అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుండి అనుమతులు పొంది కొందరు దళారులు వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ మైనింగ్ అంశంపై భారతీయ జనతా పార్టీ గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తూ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు.

ఈ క్రమంలో గనుల శాఖ నిర్వహించిన సర్వేలో తోగ్గూడెం ప్రాంతంలో సుమారు 50 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా అక్రమ తవ్వకాలు జరిగినట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం తోగ్గూడెం ప్రాంతంలోని పలువురు క్వారీ లీజ్ హోల్డర్లపై ప్రభుత్వం సుమారు రూ.300 కోట్లకు పైగా డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఈ భారీ జరిమానాలను చెల్లించకుండా కొన్ని క్వారీలు రోజువారీగా అక్రమంగా తవ్వకాలు కొనసాగిస్తూ క్రషింగ్ మిల్లులు నడుపుతున్నాయని ఆయన విమర్శించారు. సంవత్సరాలుగా అక్రమంగా ఖనిజాన్ని తవ్వడంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయ నష్టం జరుగుతోందని తెలిపారు. అక్రమంగా తవ్విన ఖనిజాలపై సెయినియరేజ్ ఫీజు మరియు భారీ పెనాల్టీలు విధించినప్పటికీ కొందరు క్వారీ యజమానులు ఇప్పటికీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకపోవడం ఆశ్చకరమని అన్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందో ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు. తోగ్గూడెం ప్రాంతంలో అక్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టం మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మరియు మైన్స్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.




అలాగే ప్రభుత్వానికి రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయాలని, ఇన్ని సంవత్సరాలుగా కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అక్రమంగా నడుస్తున్న క్వారీలు మరియు క్రషింగ్ మిల్లుల అనుమతులను రద్దు చేసి ప్రజల అవసరాల నిమిత్తం ఆ ప్రాంత గిరిజనులకే కొత్త అనుమతులు ఇచ్చి మైనింగ్ నిబంధనల ప్రకారం కంకర సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రూ.300 కోట్ల విలువైన అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనివల్ల ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఎంత వరకు ఉందో ప్రజలకు అర్థమవుతోందని అన్నారు.

ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. అలాగే ఈ కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయడమే కాకుండా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నోముల రమేష్,గోడుడు శ్రీధర్,విద్యాసాగర్ (కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు),కాల్వ ప్రసాద్,శ్రీనివాస్, మాదారపు లక్ష్మణ్,లింగగిరి వెంకట్రామయ్య ,భూక్య మోహన్,భూక్య ఆశ, కోటేశ్వరావు, పవన్, కొత్తపల్లి విజయ్, బానోత్ బాలాజీ లు పాల్గొన్నారు.



## సీజ్ చేసిన ఇసుక నిల్వలను వేలం వేసిన రెవెన్యూ అధికారులు

**ఆర్మూర్, మార్చి 17 (నినాదం)**

బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని గాండ్ల పెట్ గ్రామంలో అక్రమ ఇసుక రవాణా రాత్రివేళ కొనసాగిస్తూ, అక్రమ ఇసుక నిల్వలు జోరుగా ఏర్పాటు చేసుకోవడంతో, అదే గ్రామానికి చెందిన అక్రమ ఇసుక రవాణా అక్రమార్కులు ఒక వ్యక్తి అడ్డువస్తున్నాడని, ఎక్కడ అడ్డుకుంటాడు అని రాత్రివేళ అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని బైక్ పై వచ్చి ఢీకొట్టడంతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదానికి గురికావడం, ఈ విషయం పత్రికల జర్నలిస్టులకు, సమాచారం అందించడంతో ఒక పత్రికలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ ఇసుక నిల్వలు అనే వార్త ప్రచురితం కావడం తో, రెవెన్యూ పోలీస్ అధికారులు మేల్కొని ఈనెల 10వ తేదీన మోర్తాడు మండల ఎస్సై, బి. రాము, మండల ఆర్ ఐ రంజిత్, జిపిఏ, పోలీసులు గ్రామానికి వెళ్లి అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేయడం జరిగింది. ఇట్టి సీజ్ చేసిన ఇసుక నిల్వలను నివేదికను రెవెన్యూ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం రోజున మోర్తాడ్ రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అక్రమ ఇసుక నిల్వలను ఓపెన్ యాక్షన్ ద్వారా, 70 ట్రిప్పుల అక్రమ ఇసుక నిల్వలను వేలం వేయగా, అదే గాండ్ల పెట్ గ్రామానికి చెందిన పల్లపు రాజేశ్వర్ 1,49 3o2 పాట పాడి ఇసుకను సొంతం చేసుకున్నారని మోర్తాడ్ మండల తాసిల్దార్ కృష్ణ, ఆర్. ఐ.రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక నిల్వలను వేలం వేయడం ద్వారా వచ్చిన రుసుమును జిల్లా కలెక్టర్ నిజాంబాద్ ఆదేశాల మేరకు సాండ్ సొసైటీ నిజాంబాద్ పేరున డిడి రూపంలో జమ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పోలీసులు, తదితరులు,పాల్గొన్నారు.




## క్లీన్ అండ్ గ్రీన్‌తో... ఆదర్శంగా పోలీసులు

**స్టేషన్ పరిసరాల శుభ్రతకు స్వయంగా శ్రీకారం**

**మెట్‌పల్లి, మార్చి 17: ( నినాదం)**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన “ప్రిమైసెస్ మెయింటెనెన్స్ – క్లీన్ అండ్ గ్రీన్” కార్యక్రమం పోలీసుల బాధ్యతాభావాన్ని మరోసారి చాటిచెప్పింది. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ, సీఐల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని స్టేషన్ పరిసరాలను శుభ్రపరిచారు. చెత్తను తొలగించడం, మొక్కల సంరక్షణ, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుండే పోలీసులు, సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి కార్యక్రమాలను కూడా కొనసాగిస్తారని పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో ప్రజలు గ్రహించి తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

## రికార్డు స్థాయిలో వారసంత వేలం...

**55 లక్షలకు దక్కించుకున్న పరకాల వాసి...**

**శుభాకాంక్షలు తెలిపిన చైర్మన్ ప్రశాంత్ కుమార్**

**జమ్మికుంట, మార్చి 17 (నినాదం)**



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంత టెండర్ వేలంపాట మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించగా గత ఏడాది కంటే సుమారు 15 లక్షల రూపాయలు అదనంగా పాట పాడి దక్కించుకున్న పరకాల వాసి పోరండ్ల రమేష్. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ అంగడి వేలం పాట 55లక్షల 35వేలకు పరకాల గ్రామానికి చెందిన పోరండ్ల రమేష్ దక్కించుకున్నాడు. గతంలో (2025-26) 40లక్షల 61వేలకు ఇదే పోరండ్ల రమేష్ దక్కించుకోగా, నేడు నిర్వహించిన వేలం పాటలో పోటాపోటీగా వేలం పాట పాడి పోరండ్ల రమేష్ 55లక్షల 35వేలకు దక్కించుకున్నట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు తెలిపారు. గత ఏడాది కంటే అదనంగా పాట పాడి వారసంతను దక్కించుకున్న నిర్వాహకులకు చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. వారసంతను పారదర్శకంగా నిర్వహించాలని వివాదాలకు తావు లేకుండా సంత నిర్వహణ కొనసాగాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్ ఐ భాస్కర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**ఆదాయం సరే.. సౌకర్యాల మాటేంటి...**

జమ్మికుంట మున్సిపాలిటీలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంత వేలంపాట లో మున్సిపల్ కు భారీ ఆదాయం సమకూరినప్పటికీ నిర్వహణ మాత్రం సరిగా లేదని కనీస సౌకర్యాలు కల్పించడం లేదని పట్టణ ప్రజలతో పాటు మండల ప్రజలు అంటున్నారు. మున్సిపల్ పరిధిలోని కోరపల్లి రోడ్డులో నిర్వహించే పశువుల సంత లో కనీస సౌకర్యాలు లేవని ఎండకు ఎండుతూ మనకు తడుస్తూ తమ వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తుందని గతంలో దీనిపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేదని ఇప్పటికైనా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వ్యాపారులు అంటున్నారు. అంతేకాకుండా పట్టణ నడిబొడ్డున ప్రతి మంగళవారం నడిరోడ్డుపై కూరగాయలు ఇతర వస్తువులు అమ్ముతున్నారని సాయంత్రం వేళ రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణికులకు నరకం కనబడుతుందని మున్సిపల్ పాలకవర్గం దీనిపై ప్రత్యేక చొరవ చూపి పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వారసంత నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## నగర అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయింపు కోరిన కార్పొరేటర్లు

**అవసరమైన చోట పనులు చేపడతామని హామీ ఇచ్చిన సుడా చైర్మన్**

**కరీంనగర్, మార్చి 17(నినాదం )**

మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని కలిశారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు లేకపోవడం లేదా పాడైపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించి, అత్యవసరంగా పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్, ఇప్పటికే అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, హైమాస్ దీపాలు, సుందరీకరణ వంటి పనులకు రూ.20 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేస్తే, టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్‌తో పాటు, మల్లిఖార్జున రాజేందర్, చాడగొండ బుచ్చిరెడ్డి, గంట శ్రీనివాస్, వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, ఆకుల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల బ్యూరో మార్చి 17 (నినాదం):** మన జిల్లా క్రీడాకారులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో సైతం రాణించి, జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇటీవల జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో జూడోలో 66 కేజీల విభాగంలో జిల్లా క్రీడాకారుడు బంగారు పతకం, 46 కేజీల విభాగంలో జిల్లా క్రీడాకారిని రజత పతకం సాధించడమే కాక జిల్లా మహిళల కబడ్డీ జట్టు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో, పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలవడంతో మంగళవారం కలెక్టరేట్లో క్రీడాకారులు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. అనంతరం జిల్లా క్రీడా శాఖ తరపున కలెక్టర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ క్రిష్ణయ్య, ఎస్జిఎఫ్ సెక్రెటరీ శ్రీనివాసులు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం
18 మార్చి 2026


# జిల్లా అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం





### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల బ్యూరో మార్చి 17( నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళల జనాభా, ఉద్యోగినిల సంఖ్య ఎక్కువే కాబట్టి జిల్లా అభివృద్ధిలో వారు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలోని పలు సామాజిక సమస్యలను నిర్మూలించేందుకు తమ వంతుగా కృషి చేస్తారని ఇటీవల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళ సర్పంచులు, కౌన్సిలర్లను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. బాల్యవివాహాలను చేయడం వలన కలిగే దుష్పరిణామాలను గురించి వివరిస్తూ, వీటి నిర్మూలనకు సహకరించాలన్నారు. జిల్లాలో ఇటీవల పాస్కో కేసులు ఎక్కువగా నమోదు కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పిల్లలకు అవగాహన కలిగించాలని, వేధింపులకు గురైన మహిళలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే తప్పు చేసినవారికి శిక్షలు వేయడం జరుగుతుందన్నారు. వరకట్న వేధింపులు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు సఖీ కేంద్రంలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జనాభా గణన చేపట్టే నాటికి జిల్లాలో మహిళల అక్షరాస్యత శాతం పెరిగేందుకు కృషిచేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని పేర్కొన్నారు. ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందజేస్తుందని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అమ్మాయిల పట్ల వివక్ష చూపడం సరికాదని, వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అలాగే వివిధ రంగాలకు చెందిన మహిళలు ప్రసంగించారు. అంతకుముందు పలు విద్యాసంస్థల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళల సంక్షేమంపై రూపొందించిన గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమానికి హాజరైన పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, మహిళ ఉద్యోగులకు, నృత్య, నాటక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థినిలకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పి శంకర్, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, డిడబ్ల్యూఓ సునంద, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, డిసిపిఓ నరసింహా, పలువురు మహిళ సర్పంచులు, కౌన్సిలర్లు, మహిళా ఉద్యోగులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఏర్పాటు

**నిర్మల్ ప్రతినిధి(ఆదిలాబాద్)మార్చి17.(నినాదం):**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు మంగళవారం సమావేశమై "ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ డిగ్రీ కళాశాలల అసోసియేషన్"ను ఏర్పాటు చేశాయి. ప్రభుత్వం నిరుపేద విద్యార్థుల కోసం ప్రతియేటా మంజూరు చేసే ఫీజు రీయింబర్స్మెంట్‌పై ఆధారపడి విద్యా సేవలను అందిస్తున్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు స్థాపించిన ఈ కళాశాలలు, గత నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్మెంట్ నిధుల విడుదలలో ఆలస్యాల వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ సమస్యల పరిష్కారం, బకాయిల విడుదల, కళాశాలల స్థిరీకరణ కోసం సంఘం ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం సంఘానికి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నంగె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఏ. సతీష్ రెడ్డి, ఎస్. రవి, కార్యదర్శులుగా వొడిసెల కార్తీక్, కుంభారే లక్ష్మణ్, కోశాధికారిగా చౌహాన్ నికేష్, ఈసీ సభ్యుడిగా రమేష్, సలహాదారులుగా ఎలుకూచి రాజశేఖర్, సాయిలు తదితరులను ఎన్నుకున్నారు. సంఘం తరఫున ప్రభుత్వం తక్షణమే పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి, గ్రామీణ డిగ్రీ కళాశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు.




## విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

### ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకంపై సమావేశంలో కీలక సూచనలు

### డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. రాజిరెడ్డి

**కరీంనగర్, మార్చి 17(నినాదం)**

కరీంనగర్‌లో జరిగిన డీటీఎఫ్ జిల్లా శాఖ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. రాజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల ప్రకారం 18 శాతం కేటాయింపులు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 7 శాతంతో పరిమితం కావడం విద్యా వ్యవస్థకు అనర్థకమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవో నంబర్ 25ను రద్దు చేసి విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక విభాగంగా పరిగణించి అన్ని విషయాల ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులుగా బోధన అనుభవం ఉన్న, తగిన అర్హతలతో కూడిన సీనియర్ ప్రధానోపాధ్యాయులను నియమించాలని, మండల విద్యాశాఖాధికారుల ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ముస్కుల రఘుశంకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పట్ల గౌరవం తగ్గుతోందని, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే విధంగా పాఠ్యప్రణాళికలో మార్పులు చేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి పెండింగ్ డీఏలు విడుదల చేసి పీఆర్సీ అమలు చేయాలని కోరగా, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్ గత ఏడాది మూల్యాంకన బకాయిలు చెల్లించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు సడలింపులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.




## అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

### రంజాన్ పర్వదినం శాంతి, సేవా భావాలకు ప్రతీకగా నిలవాలని ప్రముఖుల పిలుపు

**కరీంనగర్, మార్చి 17(నినాదం )**

కరీంనగర్‌లోని కరీంనగర్ ఫంక్షన్ ప్యాలెస్‌లో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుధా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త బోధనలు మానవ శ్రేయస్సుకు దోహదపడతాయని తెలిపారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు పాటించే ఉపవాస దీక్ష ఆత్మశుద్ధి, నియమ నిష్ఠలకు నిదర్శనమని, జీవితంలో మంచి ఫలితాలు అందిస్తుందని అన్నారు. నరేందర్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు.

అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, వివిఎన్ఆర్ ఫౌండేషన్ స్థాపన నుంచే ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగను శాంతి, సామరస్యాలకు ప్రతీకగా అందరూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ముస్లిం మత పెద్దలు, మైనారిటీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## హుస్నాబాద్ బస్టాండ్‌లో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు

### ఒక్క సీసీ కెమెరా 100 మంది మనుషులతో సమానం

### సీసీ కెమెరా ఏర్పాటులో నిర్లక్ష్యం వహించవద్దు

**హుస్నాబాద్, మార్చి 17 (నినాదం):-**

హుస్నాబాద్ పట్టణ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ సీఐ కోంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు తమ ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రత మరింత మెరుగుపడుతుందని ఆయన వివరించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను త్వరగా గుర్తించి దర్యాప్తు చేయడం సులభమవుతుందని, పోలీసులకు కూడా ఇది ఎంతో సహాయపడుతుందని తెలిపారు. పట్టణ భద్రత కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ వెంకట్ రెడ్డి తో పాటు పోలీసులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు



## 1వ వార్డులో పారిశుద్ధ్యంపై కసరత్తు

### వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ ఆకస్మిక తనిఖీ

**మెట్‌పల్లి, మార్చి 17: ( నినాదం)**

పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులో చేపట్టిన శుభ్రత చర్యలను పరిశీలిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఎక్కడా చెత్త నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. వర్షాకాలానికి ముందే కాలువలను పూర్తిగా శుభ్రం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన అన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని, పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొని శుభ్రత పనులను కొనసాగించారు.



## కళా రత్న నేషనల్ అవార్డు అందుకున్న బుగ్గారం వాసి

**బుగ్గారం,మార్చి 17 (నినాదం)**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త నక్క పోచరాజయ్య (నక్క రాజు) ఆదివారం సాయంత్రం తిరుపతిలోని జి ఎస్ కే ఆర్ భవన్ లో బహుజన సాహిత్య అకాడమీ జాతి అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా కళా రత్న నేషనల్ అవార్డు అందుకున్నారు. బహుజన జాతీయవాది మాన్యశ్రీ కాన్షిరామ్ జయంతి సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన జాతీయస్థాయి సాహితీవేత్తల సదస్సులో నక్క రాజు చేస్తున్న సమాజ హితం కోసం అవగాహన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ఉద్యమ కళా ప్రదర్శనలకు గాను గుర్తింపుగా కళా రత్న నేషనల్ అవార్డు అందించడం జరిగిందని జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు ప్రముఖులు నక్కరాజుకు అభినందనలు తెలియజేశారు

## సోన్ మండల సర్పంచుల నూతన కార్యవర్గం ఎన్నిక

**నిర్మల్ ప్రతినిధి,(సోన్) మార్చి 17.(నినాదం):**

సోన్ మండల సర్పంచ్ ల సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బర్ల రాజు రెడ్డి (జాఫ్రాపూర్), ఉపాధ్యక్షులుగా చాతిరి గంగాధర్ (లోకల్ వెల్మల్), ప్రధాన కార్యదర్శిగా దేశెట్టి నరేష్ (న్యూ బొప్పారం), కోశాధికారిగా మారే విలాస్ (సంగంపేట్), సభ్యులుగా సౌమ్య మల్లేష్ యాదవ్ (మాదాపూర్), లక్ష్మి ఉదయ్ కుమార్ (సాకేరా) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యూ వెల్మల్ సర్పంచ్ రాచకొండ సాగర్, బీజేపీ



మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మాజీ ఎంపీపీలు సరిగెల గంగన్న, బర్ల మానస హరీష్ రెడ్డి, నాయకులు నర్సారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

**దమ్మపేట, మార్చి 17(నినాదం):**

మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గతంలో పెండింగ్లో ఉన్న పనులు స్థానిక సర్పంచ్ బేతం రుక్మిణి దగ్గరుండి పూర్తి చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా ప్రభుత్వంలో స్థానిక ప్రజాప్రతినిధులందరూ ఎప్పుడు అందుబాటులోనే ఉంటారని ఏవైనా సమస్యలు పరిష్కారం కాకపోతే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేటట్లు చేస్తానని తెలియజేశారు. నేడు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందికి సన్మాన కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిదులందరూ, స్థానిక నాయకులు హాజరు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు బొంతు రాజశేఖర్, చిత్తూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



### బాసర గ్రామపంచాయతీ కార్యాలయం ముందు

## ఆక్రమణల తొలగింపునకు డిమాండ్



**నిర్మల్ ప్రతినిధి, (బాసర) మార్చి 17.(నినాదం):**

నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర గ్రామపంచాయతీ కార్యాలయానికి ఆనుకుని చుట్టుపక్కల ఉన్న దుకాణాలను వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు యువకులు గ్రామపంచాయతీ కార్యదర్శిని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ భవనానికి అడ్డంగా ఉన్న ఈ దుకాణాల వల్ల అటు అడ్మినిస్ట్రేటివ్ పనులకు, ఇటు ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ సరిహద్దు గోడను ఆనుకొని గ్రామపంచాయతీ కార్యాలయం కనపడకుండా ప్రభుత్వ భూమిని, మురికి కాలువలను స్థానికులు కబ్జా చేశారు.

**గ్రామపంచాయతీ అడ్మినిస్ట్రేషన్ ఇబ్బందులు**

బాసర గ్రామపంచాయతీ కార్యాలయం గేట్ ముందు షాపులు ఉండటం వల్ల ప్రభుత్వ కార్యాలయం అన్న గుర్తింపు కోల్పోవడమే కాకుండా, పనుల నిమిత్తం వచ్చే అధికారుల వాహనాలకు, గ్రామస్తుల వాహనాలకు పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. మండల కేంద్రానికి వచ్చే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు గ్రామపంచాయతీ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఈ అక్రమ కబ్జాలతో ఏర్పడిందని అధికారులు గుర్తించలేకపోతున్నారు.

**స్థానిక ప్రజలు, యువకుల డిమాండ్**

గ్రామ అభివృద్ధికి చిహ్నంగా ఉండాల్సిన పంచాయతీ కార్యాలయం చుట్టూ ఇలాంటి ఆక్రమణలు ఉండటం సరికాదని స్థానిక ప్రజలు యువకులు అంటున్నారు. వీటిని తక్షణమే తొలగించి కార్యాలయ పరిసరాలను సుందరీకరించాలని సోషల్ మీడియా గ్రూపులలో డిమాండ్ చేస్తున్నారు. సాక్షాత్తు చదువుల తల్లి కరువు తీరిన బాసర క్షేత్రానికి ప్రతి నెలలో అధికారులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కూడా సందర్శిస్తూ ఉంటారు. కానీ అధికారులకు ఈ కబ్జాలు కనపడటం లేదా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి డివిజన్ పంచాయతీ అధికారి మండల పంచాయతీ అధికారి తో పాటు ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ ఆక్రమణలకు విద్యుత్తు, నీరు ఎవరందించారు**

బాసర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రైల్వే స్టేషన్ నుండి బాసర కు వచ్చే ప్రధాన రహదారి డ్రైనేజీ పై అక్రమ కబ్జాలు వందల సంఖ్యలో వెలిశాయి. ఈ అక్రమ కబ్జాలకు గ్రామపంచాయతీ నుండి కరెంటు అందించే విధంగా సర్టిఫికెట్లు ఉచిత ప్రభుత్వ నీరును ఏ విధంగా అందిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు ఈ విషయమై స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి స్పందించి జిల్లా కలెక్టర్ ను సంప్రదించి తక్షణమే ఈ అక్రమ కట్టడాలను తొలగించి 2027 వ సంవత్సరంలో రానున్న పుష్కరాలకు ఫుట్పాత్ ను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళిక రచించాలని ప్రజలు కోరుతున్నారు.





## దుబ్బాకలో బీజేపీ వినతిపత్రం

### ప్రభుత్వం హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్

**దుబ్బాక, మార్చి 17: (నినాదం)**

రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచనలతో, దుబ్బాకలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, అలాగే దుబ్బాక మున్సిపల్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం దుబ్బాక బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు దోరగొల్ల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రత్యేకంగా ప్రకటించిన "6 గ్యారంటీలు" మరియు "420 హామీలు" వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్తు తిరుమలరెడ్డి, సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబర్ పుట్ట వంశి, దిశ బోర్డ్ మెంబర్ సుంకోజు ప్రవీణ్ కుమార్, బీజేపీ కౌన్సిలర్లు గంభీర్పూర్ కనకరాజు, మెరుపుల సాయి కుమార్ గౌడ్, జిల్లా నాయకులు గాజుల భాస్కర్, ఒగ్గు తిరుపతి, మున్సిపల్ నాయకులు పెంటం కిషన్, ఇస్తారిగల్ల యాదగిరి, రాజు కాక, పెంటం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం 18
మార్చి 2026

## నవోదయ రిజల్ట్‌లో సత్తా చాటిన శ్రీ బాలాజీ నవోదయ సైనిక్ అకాడమీ



**కోదాడ,మార్చి 17(నినాదం):** కోదాడ పట్టణంలోని శ్రీ బాలాజీ నవోదయ సైనిక్ అకాడమీ విద్యార్థులు జిల్లా ఫస్ట్, జిల్లా తాడు ర్యాంకులు సాధించి సత్తా చాటార ని అకాడమీ నిర్వాహకులు విజయ్ తెలిపారు. మంగళవారం నవోదయ రిజల్ట్ రావడంతో జిల్లా ఫస్ట్ ర్యాంక్ ఎం సాయి శ్రీయాంక్ , జిల్లా మూడవ ర్యాంక్ విశ్వదీప్ సాధించారు. జిల్లా ర్యాంకులు సాధించడంతో విద్యార్థులను అభినందించారు. అంచలంచెలుగా శ్రీ బాలాజీ నవోదయ సైనిక్ అకాడమీ లో ర్యాంకులు రావడంతో పలువురు అభినందనలు తెలియజేశారు.

## జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా దావతే ఇఫ్తార్



**నల్లగొండ ప్రతినిధి మార్చి 17 (నినాదం ):**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నల్లగొండ పట్టణ కేంద్రంలో జిల్లా పోలీస్ శాఖ ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆధ్వర్యంలో మంగళవారం దావతే ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించబడింది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ , జిల్లా గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ ఆమెర్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, పట్టణ ప్రముఖులు, ముస్లిం మత గురువులు మరియు ఇతరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరఫున రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐలు, ఆర్.ఐలు, ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈద్గాలో సీసీ ఫ్లాట్ ఫామ్ పరిశీలన



**మిర్యాలగూడ మార్చి 17 (నినాదం):**
మిర్యాలగూడ పట్టణంలోని నల్గొండ రోడ్డు బంగారుగడ్డ లో గల ఉన్న పాత ఈద్గాలో 30 లక్షల తో నిర్మిస్తున్న సిసి ప్లాట్ ఫామ్ పనులను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ పరిశీలించారు. ముస్లిం సోదరులు రంజాన్, బక్రీద్ పండగల సందర్భంగా నమాజ్ చేసుకునేందుకు వీలు కలిగే విధంగా సౌకర్యాలుకల్పించడంలో భాగంగా సిసి ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పాత ఈద్గాకు చుట్టూ పహారి గోడ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలుతీసుకుంటున్నట్లు తెలిపారు. సోదర భావంతో పండుగల జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎండి హమిదోద్దీన్ (మోయిజ్),ఎండి సలీం, కాంగ్రెస్ నాయకులు అయూబ్, అబ్దులా, ఇమ్రాన్, పర్వేజ్, స్థానికులు వసీం తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో నేడు డయల్ యువర్ డీఎం"



**కోదాడ, మార్చి 17(నినాదం):**
ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడానికి టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో కోదాడ డిపోలో "డయల్ యువర్ డీఎం" కార్యక్రమం నేడు నిర్వహిస్తు న్నట్లు డిపో మేనేజర్ బి. శ్రీని వాసరావు మంగళవారం తెలిపా రు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 99592 26307 నంబర్‌కు కాల్ చేసి ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు తెలియజేయవచ్చని చెప్పారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణ పరిష్కారం చేపడతామని పేర్కొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో కిష్టం పల్లిలో కరెంటు కష్టాలు



**అమరచింత, మార్చి 17, (నినాదం):**
అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ గ్రామంలో కరెంటు కష్టాలు నెలకొన్నాయని కిష్టం పల్లి గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి వాపోయారు. మంగళవారం గ్రామంలోని ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఆయన మాట్లాడుతూ, ఉన్న ట్రాన్స్ఫార్మర్లకు ఆన్ ఆఫ్ లు ఏర్పాటు చేయకపోవడం ఏబి స్విచ్ లు ఎర్త్ లు బిగించకపోవడం వల్ల గ్రామంలో కరెంటు సరఫరా సరిగా లేకపోవడం వల్ల గ్రామ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో కరెంటు సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని సర్పంచ్ మల్లారెడ్డి కోరారు.

## జర్నలిస్టు జయచంద్రుడు కుటుంబాన్ని పరామర్శించిన అఖిలపక్షం



**వనపర్తి ప్రతినిధి, మార్చి 17 (నినాదం)**
గోపాల్ పేట మండల కేంద్రా నికి చెందిన జర్నలిస్ట్ జయచం ద్రుడు కుటుంబాన్ని మంగళ వారం అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పరామర్శించారు. జయచంద్రుడి తల్లి అనసూ యమ్మ మృతి చెందిన విష యం తెలుసుకున్న అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. తల్లి లేని లోటును తీర్చలేమని ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వెంకటేష్, శ్రీధర్, పొలికేపాడు సర్పంచ్ నక్క బంగారయ్య, బీఎస్పీ నాయకుడు మైబుస్, కాంగ్రెస్ నాయకులు కొంకి రమేష్, వెంకటేశ్వర్లు, బిజెపి నాయకులు రాజనగరం రవి, ప్రసాద్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు

### భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్‌ల

# స్మారక యువజనోత్సవాలను జయప్రదం చేయండి

**-ఎస్ఎఫ్ఐ, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ**




**చేవెళ్ల మార్చి 17 (నినాదం ):-**
భగత్ సింగ్ రాజ్గురు సుఖ్దేవ్ స్మారక యువజనో త్సవాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగారి అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 95 వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎస్ఐ, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో యువతకు మార్గదర్శకులుగా నిలిచిన భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం కోసం పోరాడిన భగత్ సింగ్ త్యాగం భారత యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా రంగంపై దాడులు, ప్రజాస్వామ్య హక్కుల పై జరుగుతున్న దాడుల నేపథ్యంలో భగత్సింగ్ ఆలోచనలు నేడు మరింత ఆవశ్యకంగా మారాయని వారు తెలిపారు. యువత సమాజ మార్పు కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని పట్టి పీడుస్తున్న గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్తో యువత పెడధోరణులు పడుతున్నారనీ వాటికి వ్యతిరేకంగా విద్యార్థి, యువత నడుం బిగించాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, యువజన ర్యాలీలు, డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్స్ వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, సహాయ కార్యదర్శి మాల చందు, చరణ్, నితీష్, అరుణ్, రోషన్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## రంజాన్ మాసం దానధర్మాలకు త్యాగానికి ప్రతీక

**-టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు యంఏ. ఖాదర్ షాష**



**వనపర్తి ప్రతినిధి, మార్చి 17 (నినాదం):**
రంజాన్ మాసం దానధర్మాలకు, త్యాగానికి ప్రతీక అని, సమాజంలో ఆకలితో ఉన్నవారికి సాయం చేయడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు యంఏ. ఖాదర్ షాష అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయన నివాసంలో పేద ముస్లింలకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింలకు తనవంతు బాధ్యతగా 'జకాత్' ద్వారా ఎంపిక చేసిన పలు కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, గోధుమపిండి, మంచి నూనె, సెగలు, చక్కెర, నిత్యావసర రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం 250 మందికిపైగా రంజాన్ పండుగ రోజున ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే ఆశయంతో ఈ చిన్న ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు. భవిష్యత్తులో కూడా వనపర్తి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయ కులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## ఉగాది వేళ బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**పెబ్బేరు, మార్చి 17 (నినాదం):**
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం బునియాదిపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బునియాదిపురం ప్రీమియర్ లీగ్ (బీపీఎల్ ) క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను ముఖ్య అతిథులుగా హాజరైన మండల ఎస్సై యుగేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వజగొని విజయ్ గౌడ్, మండల అధ్యక్షులు వనం రాములు, మండల కాంగ్రెస్ నాయకులు వనం మల్లేష్ యాదవ్ ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడలు యువతలో ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఐక్యతా భావం మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని యువకులను ప్రోత్సహించారు. మండల ఎస్సై యుగేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల ద్వారా శారీరక-మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జట్టు భావన, స్నేహసౌహార్దం పెంపొందించడంలో క్రీడల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామ యువకులు స్వచ్ఛందంగా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## విద్యార్థినికి తీవ్ర అస్వస్థత... పట్టించుకోని కస్తూర్బా సిబ్బంది ?



**అమరచింత మార్చి 17, (నినాదం):**
వనపర్తి జిల్లా అమరచింత మండలం పామిరెడ్డిపల్లి శివారు లోని కేజీబీవీ పాఠశాలలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పదవ తరగతి విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైంది. పామి మిరెడ్డి రెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఇందు కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని గత రెండు రోజులుగా తీవ్ర జ్వరం తో బాధపడుతోంది. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని ఎస్ ఓ కాని ఏఎన్ఎం కానీ ఎ మాత్రం పట్టించు కొక పోవడం తో సోమవారం రాత్రి బాలిక మేన మామ మోహన్ అమరచింత లోని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స చేయించి తిరిగి కేజీబీవీ లో వదిలి పెట్టారు. అయినప్పటికీ మంగళవారం కూడా తీవ్ర జ్వరం తో బాధ పడుతున్న ప్పటికీ ఏఎన్ఎం వెదవతి నిర్లక్ష్యం వల్ల బంధువులే రాత్రి ప్రభుత్వ హాస్పిటల్ కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఎస్ఓ,ఏఎన్ఎం వెంబడి ఉండి విద్యార్థి న్ని హాస్పిటల్ కు తీసుకోని వెళ్లి వైద్యం చేయించాలనే నిబంధన లు ఉన్న వారి నిర్లక్ష్యం వల్ల తమ కోడలు తీవ్ర ఇబ్బందులు పడిందని బాలిక మేనమామ ఆరోపించారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను బాలిక మేనమామ మోహన్ డిమాండ్ చేశారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ తల్లి పండుగ



**నల్లబెల్లి, మార్చి 17 (నినాదం):**
వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బుచ్చిరెడ్డిపల్లి గ్రామంలో దుర్గమ్మ తల్లి గుడి పండుగ భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు,సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తూ అమ్మవారిని కొలిచారు. పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.ఈ వేడుకలకు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు భూక్య మైబు ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన, గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న రాణా ప్రతాపరెడ్డి గ్రామాభివృద్ధి, ప్రజల సుఖశాంతి, వ్యవసాయాభివృద్ధి, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక, సాంప్రదాయ పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడమే కాకుండా సామాజిక బంధాలను బలపరుస్తాయని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పండుగ సందర్భంగా మహిళలు బతుక మ్మలు, పూజా కార్యక్రమాలతో ఉత్సాహంగా పాల్గొనగా, యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆలయానికి ప్రత్యేక అలంకరణలు చేసి, భక్తులకు అన్నదానం నిర్వహించడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండల అధ్యక్షుడు తడక వినయ్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రతాపరెడ్డి, రంగాపురం గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు, మండల ఉపాధ్యక్షులు బత్తిని కుమారస్వామి, సింగిరెడ్డి యాదగిరి, మండల నాయకులు పల్లె పర్వతాలు, ఓదెల అశోక్, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు


**దమ్మపేట, మార్చి 17(నినాదం):** మండల పరిధి గోర్రెగుట్ట గ్రామం నందు వెలసిన స్వయంభూ శ్రీశ్రీశ్రీ లక్ష్మి సమేత నరసింహ స్వామి 11వ వార్షికోత్సవం మరియు దివ్య కళ్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సోయ వీరభద్రం ను శాలువాతో ఘనంగా సత్కారించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అడపా రామకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, పార్కెలగశీడి సర్పంచ్ కోమరం సుశీల, పైడి లక్ష్మణ్, పుండరికాశీక్ష, దనకుల కృష్ణారావు, వైస్ సర్పంచ్ సోయం నాగేశ్వరరావు, రామారావు, వెంకన్నబాబు, మురహరి రాంబాబు అశ్వరావుపేట నియోజకవర్గ యువ రాజకీయ నాయకులు వాడే విజయ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

## అక్రమ ఇసుక డంపులు సీజ్




**అనంతగిరి, మార్చి 17 (నినాదం):** అనంతగిరి మండలం పాలవరం గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను రెవిన్యూ శాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. రెవిన్యూ ఇన్స్పెక్టర్ వెంకటనగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుకను గుర్తించారు. వెంటనే డంపులను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తరహా కార్యకలాపాలు పునరావృతం అయితే సంబంధితులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

## ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలే - జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** విద్యార్థులు ర్యాగింగ్ వంటి చర్యలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. భూపాలపల్లి జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ వంటి అనుచిత చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ర్యాగింగ్ నిషేధానికి సంబంధించి అమల్లో ఉన్న చట్టాల ప్రకారం, ర్యాగింగ్ ఒక శిక్షార్హ నేరమని, దీనికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మెడికల్ విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని పేర్కొంటూ, పరస్పర గౌరవం, సహకారం మరియు స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. అలాగే, ర్యాగింగ్ కారణంగా విద్యార్థులు మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతారని తెలిపారు. అందువల్ల కాలేజీ ప్రాంగణంలో సురక్షితమైన, ప్రశాంతమైన విద్యా వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినట్లయితే లేదా అలాంటి ఘటనలు గమనించినా వెంటనే కాలేజీ యాజమాన్యం లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అవసరమైతే యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్ నంబర్ 1800-180-5522 లేదా డయల్ 100 వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా. కే. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ కే. రాజేష్ (అడ్మినిస్ట్రేషన్), వైస్ ప్రిన్సిపాల్ డా. బి. శ్రీధర్ రావు (అకాడమిక్), అధ్యాపకులు, పోలీస్ అధికారులు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## నవోదయలో మెరిసిన బుగ్గారం ఆణిముత్యం



**బుగ్గారం,మార్చి 17(నినాదం):**
బుగ్గా రంలో మెరిసిన విద్యా కుసుమం. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన నక్క గౌరీనాథ్ ఇటీవలే వెలువరచిన నవోదయ ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకు సాధించి పలువురు ప్రశంసలను అందుకున్నారు.కళ్యాణి బుగ్గారం పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థి నక్క గౌరినాథ్ నవోదయ కాంపిటీటివ్ ఎగ్జామ్ లో అత్యుత్తమ మార్కులు సాధించి ర్యాంకు సాధించాడు .

## అక్రమ ఇసుక దందా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం : మైనింగ్ శాఖ పిఓ

**చెన్నూర్ మార్చి17(నినాదం):**
చెన్నూర్ మండలంలోని చింతలపల్లి గ్రామ సమీపంలో నడుస్తున్న ఇసుక క్వారీల్లో ఎటువంటి అక్రమ ఇసుక దందా నడవడం లేదు అక్రమ ఇసుక దందా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ పిఓ వెంకటేశ్వర్లు ఏ,డి జగన్మోహన్ రెడ్డి అన్నారు ఏదైనా అక్రమ రవాణా జరుగుతే మా దృష్టికి తేవాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ ఏడి తెలిపారు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా జరుగులే సహించేది లేదని , ఆయన తెలిపారు. క్వారీ యజమానులు తమకున్న ఆదేశాల అనుసారం మాత్రమే ఇసుక క్వారీ నడపాలని లేని పక్షములో ఏదైనా అక్రమాలకు పాల్పడితే ఇసుక క్వారీ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# నినాదం

బుధవారం, తెలంగాణ


18 మార్చి 2026


తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


## పంతులుపల్లి పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం

### విద్యార్థులే ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు



**నల్లబెల్లి, మార్చి 17 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం, నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని మంగళవారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెంపొందించేందుకు ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమం పాఠశాల హెడ్‌మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి, సహోపాధ్యాయులు కూనమళ్ల రాజన్ బాబు మార్గదర్శకత్వంలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వయంగా చేపట్టి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల పాత్రలను పోషించారు. విద్యార్థిని రాధారపు శివాని హెడ్‌మాస్టర్‌గా బాధ్యతలు నిర్వహించగా, ఎర్ర లాస్య సర్పంచ్‌గా వ్యవహరించింది. బైరి ప్రసన్న ఏఎపిసి చైర్మన్‌గా వ్యవహరించగా, నేతునూరి వర్షిత, రాధారపు రుత్విక్ తేజ ఉపాధ్యాయులుగా తరగతులు బోధించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత, ఏఎపిసి చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు చూపించిన చురుకుదనం, నాయకత్వ ప్రతిభను ప్రశంసించారు. చిన్న వయస్సులోనే బాధ్యతలను అర్థం చేసుకొని వ్యవహరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ఉపాధ్యాయులు తెలిపారు.

## సేవారత్న జాతీయ పురస్కారం అందుకున్న అశ్వాపురం మండలం వాసి

### ఇల్లటూరి మహేష్‌కు జాతీయ స్థాయిలో గౌరవం



**అశ్వాపురం, మార్చి 17(నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇల్లటూరి మహేష్ సేవారత్న జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 18వ జాతీయ మహాసభల సందర్భంగా ఆదివారం తిరుపతిలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. సమాజ సేవా రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధా కృష్ణ ఆధ్వర్యంలో మహేష్‌ను ఈ ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌కు స్మారక చిహ్నం, ప్రశంసాపత్రం మరియు ప్రతినిధి ఫైల్ అందజేశారు. ఇల్లటూరి మహేష్ ప్రస్తుతం మణుగూరు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు సేవలందిస్తున్నందుకు గాను ఆయనకు ఈ జాతీయ స్థాయి పురస్కారం లభించింది. మహేష్‌కు సేవారత్న జాతీయ పురస్కారం లభించినందుకు జిల్లాలోని పలువురు సామాజిక, సాహిత్య వేత్తలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.


## సీసీ రోడ్లు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



**కల్వకుర్తి, మార్చి 17 (నినాదం) :** సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ డిఈఈ బసవ లింగం అన్నారు. మంగళవారం కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊరుకొండ మండలం గుండ్లగుంట పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్యా తండాలో ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను పంచాయతీరాజ్ డిఈఈ బసవలింగం పరిశీలించి కాంట్రాక్టర్లు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తే చాలా సంవత్సరాల పాటు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటాయని అన్నారు. ఈకార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జర్పులావత్ రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేద్దాం

### ఎడిఎ శంకర్ రాథోడ్




**కొడంగల్, మార్చి 17 (నినాదం):** మారుతున్న వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రతి రైతు అడుగులు వేయాలని ఎడిఏ శంకర రాథోడ్ అన్నారు . మంగళవారం బొంరాస్ పేట్ మండల పరిధిలోని తుంకిమెట్ల రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయం కు సంబంధించిన కిట్లను నాగిరెడ్డిపల్లీ గ్రామ రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొంరాస్ పేట్ మండలంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ అందించేందుకు నాగిరెడ్డిపల్లి గ్రామం ఎంపికైందని అన్నారు. త్వరలో కిట్లు అందించిన రైతులకు ప్రకృతి వ్యవసాయం పట్ల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో పోలప్ప, ఏఈఓ పవన్, స్వాతి , జగదీష్, శైలజ, రైతులు రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గుండాల మండలంలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

### రెండు రోజుల్లో మార్పు లేకపోతే గుర్తింపు రద్దు

### ఏకలవ్య పాఠశాల ఏజెన్సీకి కలెక్టర్ హెచ్చరిక





**గుండాల, మార్చి 17 (నినాదం):** గుండాల మండలంలో ప్రభుత్వ సేవల నాణ్యతను సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా విద్య, వైద్యం, పశు సంవర్ధక మరియు పరిపాలన రంగాలకు సంబంధించిన పలు సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సమయానికి నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. గుండాల మండలం ముత్తాపురం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులు,ఆర్ఓ వాటర్ ప్లాంట్,మరుగుదొడ్లు,డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, కంప్యూటర్ ల్యాబ్ తదితర సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, పాలు సరఫరా, పరీక్షల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. పరిశీలనలో పాఠశాలలో పరిశుభ్రత లోపాలు, కిచెన్ షెడ్‌లో అస్వచ్ఛత, వంట ప్రాంగణంలో నిర్లక్ష్య నిర్వహణ, సిబ్బంది కొరత, కంప్యూటర్ ల్యాబ్‌లో దుమ్ము పేరుకుపోవడం, మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడం వంటి అంశాలను గమనించి కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన కలెక్టర్, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రెండు రోజుల్లో పాఠశాలలో ఉన్న అన్ని లోపాలను పూర్తిగా సరిచేయాలి. లేనిపక్షంలో ఏజెన్సీ గుర్తింపును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చే చర్యలు తీసుకుంటాం అని కఠినంగా హెచ్చరించారు. ఉదయం వండిన ఆహారాన్ని సాయంత్రం వరకు నిల్వ ఉంచకుండా, ప్రతి భోజనం తాజాగానే వండించి నాణ్యతతో అందించాలని స్పష్టం చేశారు. అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి వారు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా వచ్చే కేసులు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలిస్తున్న ఆసుపత్రులపై ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల గది, ఇంజెక్షన్ రూమ్, స్టోర్ రూమ్, రక్త పరీక్షల గది తదితర విభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను సమగ్రంగా తనిఖీ చేశారు. డెంగ్యూ పరీక్ష కిట్ల లభ్యతపై విచారించి, అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. మందుల పంపిణీ గదిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, కారణాలను ప్రశ్నించారు. మందుల నిల్వ గదిని పరిశీలించి గడువు తేదీలను తనిఖీ చేశారు. మందుల నిల్వ గదిలో ఎయిర్ కండిషనింగ్ సదుపాయం కల్పించడం తో పాటు ఫార్మసిస్ట్‌ను నియమించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి అని తెలిపారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా నిర్దిష్ట గడువులో కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న ఆర్ఓ ప్లాంట్ రెండు సంవత్సరాలుగా పనిచేయకపోవడాన్ని గమనించి, ఇప్పటికే మంజూరైన కొత్త ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కిచెన్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. వంటకు మినరల్ వాటర్ వినియోగించాలని సూచించారు. పర్యటనలో భాగంగా ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మందుల నిల్వలు, రికార్డులు, సిబ్బంది హాజరు, పశువులకు అందిస్తున్న వైద్య సేవల నాణ్యతపై సమీక్షించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు పశువులపై ఆధారపడి జీవిస్తున్నందున, పశువులకు సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు సమయానికి వేయించడం, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక సేవలను బలోపేతం చేసి పశుపాలకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది క్రమం తప్పకుండా పర్యటిస్తూ పశువుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ ఖాసిమ్, మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంపీడీవో బాలరాజు, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ నితిన్ సింగ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ సుధీప్, కస్తూరిబా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రావణ సంధ్య, బోధన సిబ్బంది, వైద్య సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనం లేక అర్వయ్యపల్లిలో ఇబ్బందులు

- పనుల నిర్వహణలో ఆటంకాలు..
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని గ్రామస్తుల విజ్ఞప్తి




**నల్లబెల్లి, మార్చి 17 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని అర్వయ్యపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనం లేకపోవడంతో పరిపాలన సక్రమంగా సాగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పంచాయతీ భవనం మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామంలో ప్రత్యేకంగా పంచాయతీ కార్యాలయం లేకపోవడంతో పన్నుల వసూలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి కీలక పనులు నిర్వహించడంలో ఇబ్బందులుఎదురవుతున్నాయని గ్రామ పెద్దలు తెలిపారు. కార్యాలయం లేకపోవడం వల్ల పంచాయతీ పాలనపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమావేశాలకు సరైన వేదిక లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. గ్రామానికి అధికారులు వచ్చినప్పుడు సమావేశాలు నిర్వహించేందుకు తగిన స్థలం లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల గ్రామానికి సంబంధించిన ముఖ్య నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. ఇటీవలి కాలంలో అర్వయ్యపల్లి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నప్పటికీ పంచాయతీకి స్వంత భవనం లేకపోవడం గ్రామ ప్రజల్లో నిరాశను కలిగిస్తోంది. గ్రామ పరిపాలనను బలోపేతం చేయాలంటే పంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణం అత్యవసరమని వారు అభిప్రాయపడ్డారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి అర్వయ్యపల్లి గ్రామానికి పంచాయతీ భవనం మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి దృష్ట్యా ఈ అంశంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

## జిల్లా కలెక్టరేట్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్

### అదనపు కలెక్టర్ అడిషనల్ డిసిపిల ఆధ్వర్యంలో..



**మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 17 (నినాదం):** జిల్లా పరిధిలోని కర్మాగారాలలో, పరిశ్రమలలో అకస్మాత్తుగా జరిగే కెమికల్ బ్లాస్ట్,లీకేజీ, ఏవైన ప్రదేశాలలో బాంబ్ బ్లాస్ట్ లు వంటి ప్రమాదాలు జరిగినపుడు ఆ ప్రాంతాలలో గాయపడిన వారిని కాపాడి, సహజ పరిస్థితి నెలకొల్పేలా జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) వారి ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో మాక్ డ్రిల్ నిర్వహించారు. కెమికల్ బ్లాస్ట్ అయినప్పుడు విడుదలయ్యే వాయు కాలుష్య సాంద్రతను బట్టి అత్యవసరమైన, అవసరమైన మేరకు పరిస్థితులకు అనుగుణంగా సహజమైన వాతావరణాన్ని నెలకొల్పడానికి తీసుకునే చర్యలను గురించి మాక్ డ్రిల్ లో ప్రత్యక్షంగా చూపిస్తూ ఎన్డిఆర్ఎఫ్ గౌతం కుమార్ వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఏవిధంగా అత్యవసర చికిత్స అందించడానికి ఏర్పాట్ల గురించి వివరంగా తెలియజేసారు. ప్రమాదాలు జరిగినప్పుడు చేసే ఫీల్డ్ ఆపరేషన్లలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమన్నారు. ప్రమాదాలు జరిగిన చోట సిబ్బంది ఎక్కువ సమయం విధులు నిర్వహించవలసి ఉంటుంది, వారి ఆరోగ్యభద్రత రీత్యా ప్రత్యేక కిట్స్, మాస్కు, డ్రెస్, గ్లౌజులు ధరించి, అవసరమైన మేరకు బాధితులకు అందించి వారిని కాపాడడమే కాకుండా తమను తాము కాపాడుకునే విధానాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ వివంచారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యల పై ఎన్డిఆర్ ఎఫ్ బృందం అవగాహన కలిగించారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్ యొక్క దశలవారీ వివరాలను, ఉపయోగించిన క్లోరిన్ అనే రసాయనం గురించి సవివరంగా వివరించారు. ఎన్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక, కర్మాగారాలు వైద్య విభాగాల సమన్వయంతో మెడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్‌లో ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అడిషనల్ డిసిపిలు వెంకట్ రెడ్డి, హనుమంతరావు, డిఆర్ఓ చంద్రావతి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## మల్లారెడ్డి కాలనీలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి




**అల్వాల్, మార్చి 17 (నినాదం):** అల్వాల్ సర్కిల్ పరిధిలోని మల్లారెడ్డి కాలనీలో తీవ్ర ట్రాఫిక్ రద్దీ పై కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి. టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఆ ప్రాంతాన్ని పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు చంద్రపురం కాలనీ ద్వారా వెళ్లే ప్రత్యామ్న మార్గం ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ అధికారులకు తెలిపారు. చంద్రపురం కాలనీ రోడ్డును శుభ్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వేశ్వరరావు, కిరణ్, హరిప్రసాద్, రమణమూర్తి, భాస్కర్ రావు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ చేసిన దాము




**కొడంగల్, మార్చి 17 (నినాదం):** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు లో ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము తోఫా సెట్టు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు తోఫా సెట్టు పంపిణీ చేస్తుందని, అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన తోఫా సెట్టు ను తన వార్డు లోని ముస్లిం లకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

## రేణుక ఎల్లమ్మ దేవాలయం చైర్మన్ మహేష్‌కు సన్మానం



**చేగుంట: మార్చి 17 (నినాదం):** పెద్ద గుండవల్లి గ్రామంలో గుడి చైర్మన్ మహేష్ ఆధ్వర్యంలో. శ్రీ రేణుక ఎల్లమ్మ మాత ఆలయంలో. ప్రత్యేక పూజలు, నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం చేగుంట మండలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజనక ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా పూజ కార్యక్రమం చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు గుడి చైర్మన్ మహేష్ చేతుల మీదుగా సత్కారం చేశారు అదేవిధంగా వైస్ చైర్మన్ యాదగిరి. బుడ్డ భాగ్యరాజ్, రజనక రాము, ఆకుల మల్లేశం, శాలువాతో సన్మానించారు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు తప్పవు

### తహసీల్దార్‌కు బీజేపీ వినతిపత్రం

### ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు




**నల్లబెల్లి, మార్చి 17 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న నాయకులు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. వినయ్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. యువతకు హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్ విడుదలలో ఆలస్యం జరుగుతోందని, నిరుద్యోగ భృతి అమలు కానందున యువత తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు పెంపు, కల్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలులో నిలిచిపోయాయని విమర్శించారు. రైతులకు అందించాల్సిన రైతు భరోసా సమయానికి,అందకపోవడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని, దీని వల్ల రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు,ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో కూడా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని, ప్రజల సమస్యలపై స్పందన లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయాలని, లేకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రంగాపురం గ్రామ సర్పంచ్ ఓరుగంటి రాజు మాధురి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రతాప్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, ఉపాధ్యక్షులు బత్తిని కుమారస్వామి, సింగిరెడ్డి యాదగిరి, కార్యదర్శి ఓదెల అశోక్, కోశాధికారి మురికి మనోహర్, సీనియర్ నాయకులు వల్లే పర్వాతలు, బోట్ల ప్రతాప్, కొండ్లె రమేష్, ముచ్చింపుల గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారం క్రాంతి కుమార్, నాయకులు భూమా నరేష్, రాపర్తి అనిల్, జన్ను మధు, బానోతు వీరన్న తదితరులు పాల్గొన్నారు.